క్లుప్తంగా

ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామి కల్యాణం చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. బుధవారం రాత్రి స్వామి కల్యాణం కనువిందుగా సాగింది. అంగర, పడమర ఖండ్రిక, టేకి సమీప గ్రామాల భక్తులు స్వామి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు కుంచపూడి బాలాజీ, చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలోని పండితులు స్వామికి కల్యాణ పూజలు చేశారు. గురువారం కొట్నాల ఉత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. పుష్పోత్సవం, ఊంజల్ సేవా తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిశాయి.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: మండలంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో డి.శ్రీనివాసు గురువారం తెలిపారు. మాచవరం, సోమేశ్వరం గ్రామాల్లో ఒక్కొక్కటి, వెదురుపాకలో రెండు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆయన తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల నాలుగో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, దరఖాస్తు కాపీలను పంచాయతీ కార్యదర్శికి అందజేయాలన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న సర్పంచ్

కె.గంగవరం: యర్రపోతవరంలో సర్పంచ్ పిల్లి రాంబాబు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం సర్పంచ్ రాంబాబు జన్మదినం సందర్భంగా గ్రామ యూత్ సభ్యులు, స్నేహితులు సహకారంతో పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ మేడిశెట్టి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

5న మెగా వైద్య శిబిరం

మండపేట: ఏడిదలో ఈనెల 5వ తేదీన గ్రామానికి చెందిన 1980–85 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. తమ గ్రామంలో చదువుకొని వివిధ పట్టణాల్లో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులతో పాటు ఇతర వైద్యులు రోగులకు సేవలు అందిస్తారన్నారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే శిబిరంలో బీపీ, సుగర్, గుండె, ఎముకలు, ఉపిరితిత్తులు, కిడ్నీలు, క్యాన్సర్ సంబంధిత వ్యాధులతో పాటు మానసిక వైకల్యం తదితర సమస్యలకు ఉచితంగా పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేస్తారన్నారు. ఏడిద, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

ఆసుపత్రికి వెళ్లి.. పింఛను అందించి..



వెంకటర్రావుకి పింఛను అందజేస్తున్న వలంటీరు నానాజి

కాజులూరు: ఆర్యావటానికి చెందిన బిట్ర వెంకటర్రావు గుండెపోటుకు గురై కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైఎస్సార్ పింఛను కానుక అందించేందుకు ఒకటో తేదీన వెంకటర్రావు ఇంటికి వెళ్లిన వలంటీరు తాతపూడి నానాజి లబ్ధిదారుడి పరిస్థితి తెలుసుకుని గురువారం కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛను సొమ్ములు అందజేశాడు. గ్రామ సర్పంచ్ వనుం సూర్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు తదితరులు వలంటీరు తాతపూడి నానాజిని అభినందించారు.

రక్త పింజర హతం

అల్లవరం: ఓడలరేవులోని సోమాని వెంకటరమణకు చెందిన కొబ్బరి తోటలో ఉపాధి కూలీలు పనులు చేస్తుండగా రక్త పింజర కనిపించింది. తోటలో మామిడి చెట్టు చుట్టూ ఏర్పాటు చేసిన మెస్‌లో ఆ పాము చిక్కుకుంది. దానిని ఉపాధి కూలీలు హతమార్చారు. ఇది సుమారు ఆరు అడుగుల పొడవు ఉందని రైతు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

అమలాపురం రూరల్: కృష్ణా జిల్లా నూజివీడులో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ జరిగే ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుకు కామనగరువు ఆదిత్య స్కూల్ విద్యార్థి ఇళ్ల శ్రీకిరణ్ ఎంపికయ్యాడు. ఆ విద్యార్థిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ బి.రామప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

సాగుకు ఇబ్బంది రానీరు..

- సాగునీటి సరఫరాలో శాస్త్రీయత
- రబీ పూర్తయ్యే వరకూ నీరు అందజేత
- ప్రభుత్వం రైతులకు భరోసా
- రెండు నియోజవర్గాల్లో 1,00,667 ఎకరాల సాగు
- 11,58,33,750 మిల్లీ మీటర్లు నీరు అవసరం



కపిలేశ్వరపురంలోని పంట కాలువ

కపిలేశ్వరపురం: సాగు సక్రమంగా సాగాలంటే సాగు నీటి సరఫరా సజావుగా సాగాలి. విత్తు నాటిన నుంచి గింజ చేతికందే వరకూ తరచూ నీటి వినియోగం ఉంటుంది. సుమారు మూడు నెలల సాగు కాలంలో ఏ ఒక్క ఎకరా ఎండిపోకుండా అవసరమైన నీటి సరఫరాకు అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. రెండు నియోజకవర్గాల పరిధిలో సాగు నీటి సరఫరాపై చేపడుతున్న చర్యలపై ఈ కథనం...

రెండు నియోజకవర్గాల్లో సాగు ఇలా

ఒక ఎకరా వరి సాగు కాలం మొత్తానికి 1,250 మిల్లీ మీటర్లు నీరు అవసరం. రామచంద్రపురం నియోజకవర్గంలో 75 గ్రామాల్లో 53,249 ఎకరాలకు 6,65,61,250, మండపేట నియోజకవర్గంలో 43 గ్రామాల్లో 47,418 ఎకరాలకు 4,92,72,500 మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 1,00,667 ఎకరాలకు 11,58,33,750 మిల్లీమీటర్ల సాగునీరు అవసరమవుతుంది.

పక్కా ప్రణాళిక

రైతు పక్షపాతిగా పేరొందిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంట సాగులో ముందస్తు ప్రణాళికను రూపొందిస్తూ ముందుకు సాగుతోంది. దానిలో భాగంగా ఖరీఫ్ సాగు కొనసాగుతుండగానే రబీ సాగుపై దృష్టి సారించింది. సాగునీటి సరఫరాకు ఇరిగేషన్, అనుబంధ శాఖలతో జిల్లా స్థాయిలో సమీక్షలు చేసి పక్కా ప్రణాళికను రూపొందించారు.

క్షేత్ర స్థాయిలో వరి సాగు నీటి అవసరం ఇలా...

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం	అవసరమైన నీరు (మి.మీ)
రామచంద్రపురం	25	18,806	2,35,07,500
కె.గంగవరం	26	15,656	1,95,70,000
కాజులూరు	26	18,787	2,34,83,750
మండపేట	12	16,892	2,11,15,000
రాయవరం	12	14,646	1,83,07,500
కపిలేశ్వరపురం	19	15,880	1,98,50,000
మొత్తం	120	1,00,667	11,58,33,750

తోడ్పాటునిస్తున్న సాగు సలహా మండళ్లు

ప్రస్తుత ప్రభుత్వం రూపొందించిన వివిధ దశల్లోని సాగు సలహా మండళ్లు సాగు ప్రక్రియకు తోడ్పాటునిస్తున్నాయి. ఆర్బీకే స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ సాగు సలహా మండళ్లను ఏర్పాటు చేసింది. దీంతో స్థానిక రైతు సూచనలు, సలహాలు సైతం పై స్థాయిలో తీసుకునే నిర్ణయాల్లో భాగమవుతున్నాయి. ఆ మండళ్లలో రెవెన్యూ, జలవనరులు, వ్యవసాయ శాఖల భాగస్వామ్యం ఉండడంతో పటిష్టమైన నిర్ణయాలకు అవకాశం ఏర్పడుతుంది.

నీటి వినియోగంలో అవగాహన అవసరం



ఎగువ భూములున్న రైతులు ఎక్కువ నీటిని వినియోగిస్తుండడంతో పల్లపు రైతులకు సమస్య ఎదురవుతుంది. దీంతో వారి భూముల్లో దిగుబడి తగ్గే పరిస్థితులొస్తాయి. నేలలో పైరుకు తడి 75 శాతం వరకూ తగ్గిపోతే నీటి ఎద్దడి ఉంటుంది. అలాగని అవసరం రాకుండా ముందస్తుగా నీరును పెట్టినా ప్రాణవాయువు దక్కక పంట దిగుబడి తగ్గిపోతుంది. నాట్లు వేసేటప్పుడు నీరు పలుచగానూ, మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బు చేయడం పూర్తయ్యే వరకూ 2 సెంటిమీటర్లు నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకూ 5 సెంటీమీటర్లు నీరుండాలి. ఈనిక దశ, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిలోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పది రోజులు ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు బాగా చేయదు.

–కేవీఎస్ రమేష్ కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం మండలం

చెల్లూరులో అగ్ని ప్రమాదం

గేదె మృతి, మరో ఏడు గేదెలకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన గేదె

రాయవరం: చెల్లూరు శివారు సూర్యారావుపేట సమీపంలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన రైతు రిమ్మలపూడి భాస్కరరావు తన పశువుల పాకలో ఎనిమిది గేదెలను కట్టి, రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటికి వచ్చేశాడు. సుమారు 8.30 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించి, ఒక్కసారిగా పశువుల పాక దగ్ధమైందని గ్రామస్తులు చెప్పడంతో రైతు వెళ్లి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా లాభం లేకుండాపోయింది. పశువుల పాక ప్రధాన రహదారి నుంచి లోపలికి ఉండడంతో ప్రమాదం జరిగిన తర్వాతే గుర్తించామని చుట్టుపక్కల వారు తెలిపారు. దీంతో పాక పూర్తి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గేదె మృతి చెందగా, తీవ్ర గాయాలతో మరో రెండు గేదెల పరిస్థితి విషమంగా ఉంది. మరో ఐదు గేదెలు 50 శాతం కాలిన గాయాలతో ఉన్నాయి. ఒక్కో గేదె విలువ సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకూ ఉంటుందని, అన్ని గేదెలు చూడి దశలో ఉన్నాయని రైతు చెబుతున్నాడు. ప్రమాదం ఎలా సంభవించిందో తెలియడం లేదని, దోమల నివారణకు కనీసం పొగ కూడా పెట్టలేదని ఆవేదనగా చెందాడు. ఎవరైనా ఆకతాయిలు మద్యం సేవించడానికి వచ్చి, సిగరెట్లు కాల్చడం వల్ల ప్రమాదం సంభవించిందా? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

మట్టి ఖర్చులకు నిమిత్తం రూ.10వేలు అందజేత



బాధిత కుటుంబానికి బీమా సాయం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: తాళ్లపొలంలో అనారోగ్యంతో మృతి చెందిన మేడిశెట్టి లక్ష్మణ్ కుటుంబానికి వైఎస్సార్ బీమాలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, ఉప సర్పంచ్ వల్లు శివల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మేడిశెట్టి రామకృష్ణ, మేడిశెట్టి శ్రీను, మేడిశెట్టి నూకరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వరుని నగరోత్సవం



విశేష అలంకరణలో భీమేశ్వరస్వామి, మాణిక్యాంబా అమ్మవార్లు



ద్రాక్షారామ పుర వీధుల్లో పల్లకీలపై కల్యాణ మూర్తుల నగరోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీసమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం పల్లకీలపై కల్యాణమూర్తుల నగరోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి గరుడ వాహనంపై కల్యాణమూర్తులను మేళతాళాలుతో ఊరేగించి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) ఆధ్వర్యంలో నిర్వహించిన నగరోత్సవంలో అర్చకస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై రాజమహేంద్రవరానికి చెందిన బాలరాజరాజేశ్వరి కూచిపూడి నృత్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా అలరించాయి. నృత్య శిక్షకుడు హేమాద్రి బదరీనాథ్ నేతృత్వంలో చిన్నారులు తమ నృత్య కౌశలాన్ని ప్రదర్శించారు.

శివనారాయణను సత్కరించిన అధ్యాపకులు



శివనారాయణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాయవరం: కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల హిస్టరీ అధ్యాపకుడు శివనారాయణను కళాశాల అధ్యాపకులు గురువారం సత్కరించారు. శివనారాయణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన విషయం పాఠకులకు విదితమే. శివనారాయణను కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత అధికారి

యానాం: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని విశ్రాంత రవాణా అధికారి పుదువై బాలకృష్ణన్ అన్నారు. గురువారం యానాం పబ్లిక్ స్కూల్‌లో పుదుచ్చేరి రవాణా శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్‌ను గుర్తించడం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల లాభాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. హెచ్‌ఎం బాలాజీ సుధాకర్, జనవిజ్ఞాన వేదిక కోఆర్డినేటర్ ఆనాల వీరభద్రరావు, టీచర్లు భారతి, భానుమతి, లలితా సావిత్రి, సీఎస్ఎస్ కోఆర్డినేటర్ బొట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహానికి విరాళం

అమలాపురం టౌన్: ఐ.పోలవరం మండలం ఎదుర్లంక గ్రామంలో కొత్తగా నిర్మించనున్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహానికి కాట్రేనికోన మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన రంబాల దొరబాబు రూ.75 వేల విరాళాన్ని సమకూర్చారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు ఈ విరాళాన్ని దొరబాబు గురువారం అందజేశారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే పొన్నాడ స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. దాత దొరబాబును ఎమ్మెల్యే అభినందించారు.

శరవేగంగా పూడికతీత పనులు

ఎమ్మెల్సీ తోటకు రైతుల కృతజ్ఞతలు



పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న దృశ్యం

మండపేట: పట్టణంలోని రామచంద్రుడు పంట కాలువలో పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సమస్య తన దృష్టికి రాగానే వెంటనే స్పందించి పరిష్కరించడంపై కాలువ పరిధిలోని రైతులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. రామచంద్రుడు పంటకాలువపై స్థానిక గొల్లపుంత, బూరుగుపుంత ప్రాంతాల్లో దాదాపు 500 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేస్తున్నారు. కాలువ పూడికతో నిండి శివారు భూములకు సాగునీరందక పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో రైతులు స్వచ్ఛందంగా పూడికతీతకు పనులు చేపట్టారు. స్థానిక నేతలు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. పూడికతీతలో జాప్యంపై ఇరిగేషన్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆఘమేఘాలపై అధికారులు పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబుతో కలిసి దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. పట్టణంలోని వాడకం నీరు, వ్యర్థాలు పంటకాలువలోకి చేరి ఏటా పూడిక సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని రైతులు ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని వ్యర్థాలు పంట కాలువలోకి చేరకుండా సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌ను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. పట్టణ పరిధిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలోను, పట్టణం వెలుపల ఇరిగేషన్ అధికారులు రెండు జేసీబీలతో పూడికతీత పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలో వాడకం నీరు, వ్యర్థాలు పంటకాలువలోకి రాకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నామని ఇరిగేషన్ జేఈ నాగరాజు గురువారం తెలిపారు. తమ సమస్య తెలిసిన వెంటనే స్పందించడంతో పాటు శాశ్వత పరిష్కారానికి చొరవ చూపడంపై ఎమ్మెల్సీ తోటకు కాలువపరిధిలోని రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు



కాలేరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కాలేరులో గడపగడపకూ మన ప్రభుత్వం

కపిలేశ్వరపురం: కుల, మత, ప్రాంతీయ, రాజకీయాలకు అతీతంగా అర్హతే ఆధారంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కాలేరులో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్సీ తోటకు పూలమాలలతో స్వాగతం పలికి హారతులు పట్టారు. చిన్నారులు నుంచి అవ్వతాతలు వరకూ అందరూ ఎమ్మెల్సీ తోటతో అడుగులు వేశారు. నిన్ననే వలంటీర్ వచ్చి పింఛను డబ్బులిచ్చాడయ్యా అంటూ వృద్ధుడు సంతోషాన్ని పంచుకున్నాడు. నాకు స్కూల్‌లో పాఠాలు వినేందుకు ట్యాబ్ ఇచ్చారంటూ విద్యార్థిని సంబరపడింది. ఇలా ఇంటా సంక్షేమం తాలూకు ఛాయలతో గ్రామ పర్యటన సంతోషాల హరివిల్లును తలపించింది. ఎంపీటీసీ సభ్యులు టేకి సత్యమంజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఏలేటి గంగరాజు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు గ్రామంలో అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్సీ తోటకు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ప్రతి పేదవాడి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి అందించాలని, అందులో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ తోట భరోసా ఇచ్చారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్న ఎమ్మెల్సీ తోటకు జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అమలవుతున్నాయన్నారు. పేదలపై ప్రేమతో ఆర్థిక ఇబ్బందులను సైతం అధిగమించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇంతకు ముందు ప్రజలకు మంచి చేయలేని విపక్షాల నేతలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయని వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు ఏలేటి గంగరాజు, ఉప సర్పంచ్ పలివెల పద్మమణి, నాయకులు గుణ్ణం కృష్ణారావు, పుట్టా వెంకటరాయుడు, గుడాల సత్యనారాయణ, సలాది చిట్టబాబు పాల్గొన్నారు.

మహేష్‌బాబు చేసిన మేలు మరువలేం



చిన్నారితో ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు

మండపేట: తమ కుటుంబానికి ప్రముఖ సినీహీరో మహేష్‌బాబు చేసిన మరువలేమని పట్టణంలోని రావులపేటకు చెందిన కొరకూటి రవిచంద్రకాంత్, విజయదుర్గ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. వీరి నాలుగేళ్ల చిన్నారి సాన్వీ అనారోగ్యంతో బాధపడుతోంది. విజయవాడలోని ఆస్పత్రిలో చూపించగా గుండెకు రంధ్రం ఉందని, ఆపరేషన్‌కు రూ.ఐదు లక్షలు వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. పేద కుటుంబానికి చెందిన చంద్రకాంత్‌కు ఆపరేషన్ చేయించే స్తోమత లేకపోవడంతో మండపేట టౌన్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు మెండు సత్తిబాబును సంప్రదించారు. చిన్నారికి వచ్చిన కష్టం గురించి సత్తిబాబు కాకినాడలోని మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌కు వివరించారు. ఈ విషయాన్ని మహేష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి చిన్నారికి విజయవాడలో ఆపరేషన్ చేయించారు. ఇప్పుడు తమ పాప పూర్తి ఆరోగ్యంతో కోలుకుందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిబాబు, ఉపాధ్యక్షుడు దుగ్గిరాల రాంబాబు, కొప్పాక సత్యనారాయణ తదితరులు వారి ఇంటికి వెళ్లి సాన్వీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తమ చిన్నారికి శస్త్రచికిత్స చేయించిన మహేష్‌బాబుకు, అందుకు సహకరించిన ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ముత్యాల భరణి, మెండు రవిచంద్ర, పలుబోతు గణేష్, రగడ, తిప్పా ప్రసాద్, మెండు మహేష్, బాబ్జి, మజ్జి శ్రీను, కేత సుబ్బు, వీరబాబు, పందిరి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



శీల గ్రామంలో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ
- శీలలో గడప గడపకూ మన ప్రభుత్వం

కాజులూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు అమలు చేయడంతో పేదల జీవితాల్లో వెలుగులు విరజిల్లుతున్నాయని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని శీల గ్రామంలో మంత్రి వేణుగోపాలకృష్ణ గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా ఏయే కుటుంబానికి ఎంతెంత లబ్ధిచే కూరిందో వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ఊపిరిగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. పథకాలన్నీ ప్రజల ఇంటి గడప వద్దకు చేర్చేందుకు వలంటీరు వ్యవస్థను, సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసి సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు దడాల కృష్ణకుమారి, పార్టీ మండల ప్రధానకార్యదర్శి పోతురాజు బాబురావు, మండల పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దుర్గారావు, యాళ్ళ సత్తిబాబు, దొమ్మేటి కొండ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సేవా సంఘం ఆవిర్భావం



నానిరాజును సత్కరించిన డాక్టర్ ప్రతాప్, కవులు, రచయితలు

అమలాపురం టౌన్: అమలాపురంలో సాయి సంజీవిని వాకర్స్ యోగా హెల్త్ సేవా సంఘం గురువారం ఏర్పాటైంది. కోనసీమ రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ఈ సంఘానికి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక కూచిమంచి అగ్రహారంలో సమావేశం జరిగింది. వైద్య, సామాజిక సేవలు అందిస్తున్న నానిరాజు సాయి సంజీవిని వాకర్స్ యోగా సేవా సంఘం అధ్యక్షునిగా ఎన్నిక కావడం అభినందనీయని శ్రీశ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్, కవి డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. సాయి సంజీవిని ఆస్పత్రి ద్వారా సేవలందిస్తున్న తాను ఇకపై వాకర్స్, యోగా రంగాల్లో కూడా ఆరోగ్యపరంగా మరిన్ని సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని నానిరాజు అన్నారు. అనంతరం నానిరాజును ప్రతాప్ సత్కరించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దింపు, ఒలుపు కార్మిక సంఘాల నాయకులు

ముమ్మిడివరం: దింపు, ఒలుపు కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు కార్మిక సంఘాల నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. దింపు, ఒలుపు కార్మికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను ఆయన నివాసంలో కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. 50 ఏళ్లు దాటిన దింపు, ఒలుపు కార్మికులకు పింఛను, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ఈ సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.